# ర్యాంకు ప్రహారం



మా అబ్బాయి ఐదో క్లాసు కాన్వెంట్‌లో చదువుకొంటున్నాడు. వాడు మా పెద్దబ్బాయి కాబట్టే, మాకున్నది ఇద్దరే పిల్లలు కాబట్టే, ఇద్దర్నీ గారంగానే చూస్తాం. వాడు తన స్కూలు (కాన్వెంట్ అనాలా?)కు సైకిల్ మీద వెళ్తాడు. పెద్ద పంపీడం పుస్తకాలు క్యారేజీ మీద పెట్టుకొని వాడు అలా సైకిల్ మీద స్కూలుకు పోవటం నాకు చూడబుద్దెయ్యదు. ఓ లావుపాటి ఆసామిని రిక్షాలో ఎక్కించుకొని ఓవర్ బ్రిడ్జి లాగలేక లాగలేక పోతున్న ముసలి రిక్షావాడు గుర్తుకొస్తాడు. అందుకే సాధ్యమైనంత వరకూ ఎవాయిడ్ చేస్తాను ఆ సీనుని.

మా ఆవిడ పిల్లల చదువుల మీద చాలా శ్రద్ధ తీసుకొంటుంది. తను చదువుకునేటప్పుడు (బి.ఎ చదివింది లెండి) ఇంత కష్టపడిందో లేదో తెలియదు. వాళ్ళ నోట్సులు తను రాయటం, తెల్లవారురుఝుమున లేచి వాళ్ళను లేపటం, పెద్దవాడితో పాటు తనూ కూర్చుని (ఆవలింతలు ఆపుకొంటూ — నన్ను పస్తులు పెడ్తూ) చదివించడం — బాగానే ఉంటుంది.

నూవాడు చదివేది చాలా పెద్ద పేరున్న కాన్వెంట్. దానికి నేను 'డొనేషన్' ఇచ్చాను.సీటు ఇచ్చారు. ఆ కాన్వెంట్‌లో చాలా ప్రత్యేకతలున్నాయి. అవేమంటే ఒక క్లాసుకు పదిహేనుమంది మాత్రమే పిల్లలు వుంటారు. ప్రతి సబ్జక్టుకు నిష్ణాతులైన అందమైన టీచర్లుంటారు. ప్రతివారం పరీక్షలుంటాయి. ప్రతినెలా నెంవారీ పరీక్షలుంటాయి. ఇక క్వార్టర్లీ, హాఫ్‌యర్లీ, ఫైనల్ తప్పవనుకోండి. అంటే దిన దిన గండం నూరేళ్ళాయుషులాగా పాపం పిల్లలు రోజూ టెన్షనే టెన్షన్ పిల్లలకే కాదు మాకు కూడా!

వాడికి ప్రతి సబ్జక్టులోనూ పాతికకు పాతిక రావాలంటుంది మా ఆవిడ. వాడికి పదిహేను వస్తే, తనే తప్పిపోయినంతగా (పరీక్షల్లో నండి బాబూ) ఫీలయ్యి, ఫేస్ అంతా మార్చేస్తుంది. దాంతో నా మూడు గోవిందో గోవిందా.

ఇలా చాలా శ్రద్ధాశక్తులు కలిగిన ఆ కాన్వెంట్‌లో మా అబ్బాయి చదూతున్నాడు అని చెప్పుకోవడం మా స్టేటస్ సింబల్. ఇక రెండోది మా వాడికి హండ్రెడ్ పర్సెంట్ — ఏ గ్రేడ్ — స్కూల్ ఫస్టు, ఇలా ఇలా చెప్పుకోవడం. రెండో స్టెప్. ఇలా చాలా స్టెప్స్. ఆ కాన్వెంట్ ప్రేమగా తమ పిల్లల తండ్రుల గౌరవార్థం శక్తివంచన లేకుండా పంచి పెట్టడానికి కృషి చేస్తూనే వున్నది. పేరెంట్ మీట్, గెట్ టు గెదర్, హెల్ప్‌టు యువర్ ఛైల్డ్, టుమారో ఈవెంట్, ఇలా... ఇలా సవాలక్ష.

ఏది ఏదైతేనేం. మా ఆవిడ ఫలితం అననీయండి, అందమైన టీచర్ల అనుభవం అననీయండి, ఏదైనా కానీయండి మా అబ్బాయి పాపం ఇరవైఐదు మార్కులకు ఇరవై నాల్గు తెచ్చుకొంటూనే వున్నాడు. పదిహేనుమందిలో వాడు ఇరవైనాల్గు మార్కులు ఇరవైఐదుకు తెచ్చుకోవటం మాకు ఆనందదాయకమేకదా!

ఇలా నడిచి పోతుండగా—

ఓ రోజు నేను, నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణ, నాని ఒక చోట కలిశాం. మా నల్గురి పిల్లలూ అక్కడే చదువుకుంటున్నారులెండి. అందరూ ఒకే క్లాసుకూడానట. ఏవేవో కబుర్లు కాకరకాయలు అయిన తర్వాత మా గొప్పలు పిల్లల చదువుల మీద కెళ్లింది.

నేను గొప్పగా "మావాడికి ఇరవైఐదుకి ఇరవైనాల్గు ప్రతి సబ్జక్టులోనూ ప్రతి పరీక్షలోనూ" అన్నాను.

దానికి శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు, నాని గూడా మా వాళ్ళకి అంతే... అన్నారు యాధృచ్ఛికంగా.

అంటే!

అందరికీ ఇరవై ఐదుకి ఇరవైనాల్గే — అన్ని సబ్జక్టుల్లో.

ఇదెలా సాధ్యం!

మర్నాడు నల్గురం — మా పిల్లల ప్రోగ్రెస్ కార్డులు చూశాం. అంతే! అంతే!

నాగేశ్వరరావు ఇంకా చొరవ చూపి ఆ క్లాసులోని పదిహేను మంది పిల్లల ప్రోగ్రెస్ కార్డుల్లో చూసొచ్చాడు.

ఇకేముంది!

అంతే! అంతే!

మేం నల్గురం — మా పెళ్ళాలకు ఈ రహస్యం చెప్పలేదు. కారణం — పాపం! వాళ్ళు ఎంత కష్టపడుతున్నారో తమ పిల్లల ర్యాంకులపై!

